రోయ్ లే-అవుట్‌లో
40x40 కమర్షియల్ గొడౌన్ గ్రౌండ్ ఫ్లోర్
40x40 ఫస్ట్ ఫ్లోర్
అద్దెకు ఇవ్వబడును
కాంటాక్ట్ నెంబర్లు 9441937973
9440343432
నియర్ జోసెఫ్ కాన్వెంట్, శ్రీకాకుళం.

సేల్స్ ఎగ్జిక్యూటివ్‌లు కావలెను
శ్రీకాకుళం జిల్లాలో అమరాన్ బ్యాటరీలు, ఇంజిన్ ఆయిల్స్ అమ్మేందుకు మార్కెటింగు ఎగ్జిక్యూటివ్స్ కావలెను. డిగ్రీ కనీస విద్యార్హత గల 25 సంవత్సరాలలోపు వయసు గలవారై ఉండాలి. మార్కెటింగ్‌లో అనుభవం గలవారికి ప్రాధాన్యత ఇవ్వబడును. ఆసక్తి గలవారు పూర్తి బయోడేటాతో అక్టోబరు 23న ఉదయం 11 గంటలకు హాజరుకావలెను.
AMARON® LASTS LONG, REALLY LONG.
కిరణ్ ఆటోమొబైల్స్, పెద్దపాడు రోడ్డు,
శ్రీకాకుళం-532 001,
సెల్: 9490 222 716, 94401 95005

ICL COURIER
INTERNATIONAL COURIER & CARGO
విదేశాలకు అతి తక్కువ ధరలో వేగవంతమైన సర్వీసు
పచ్చళ్లు ▸ బట్టలు ▸ పిండివంటలు ▸ బుక్స్ ▸ స్వీట్స్ ▸ మెడిసిన్స్ మొదలగునవి పంపించబడును.
- Free Door Step Pickup - World wide Services
- Low Cost & Fastest Delivery - Easy Online Tracking
- Safe & Secure Delivery - Free Box Packing
దూదివారి కోవెల ప్రక్కన, చిన్నబజార్ రోడ్, శ్రీకాకుళం.
9989172822, 9505944472, 9248199493

సంచలన సాయంకాల పత్రిక
# సత్యం
https://www.satyamdaily.net/
సోమవారం 21-10-2024
సంపుటి: 20 సంచిక: 177
పేజీలు: 4 వెల: రూ.1




# సమగ్రశిక్ష.. ఇదేందబ్బా!


(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

**పోలీస్ ఎస్ఐ ఉద్యోగం ముందు ఇచ్చేసి, ఆ తర్వాత తీరిగ్గా రాత పరీక్ష నిర్వహించి, ఆ వెనుక ఫిజికల్ టెస్ట్ పెట్టి, ఉద్యోగం వచ్చిన తర్వాత డిగ్రీ పూర్తిచేసే వెసులుబాటు ఇస్తే.. ఎలా ఉంటుంది? జిల్లాలో సర్వశిక్ష ఆధ్వర్యంలో భర్తీ చేస్తున్న పోస్టులకు ఇప్పుడు ఇదే పద్ధతిని అనుసరిస్తున్నట్టు కనిపిస్తుంది. తమకు కావాల్సినవారి జాబితాను ముందుగా సిద్ధం చేసి, వారి కోసం నిబంధనలు మార్చి, వారికి మాత్రమే సర్టిఫికెట్ వెరిఫికేషన్ చేసి ఉద్యోగాలిస్తున్నారు. వివరాల్లోకి వెళితే..**

- ముందుగా ఉద్యోగం
- ఆ తర్వాతే మెరిట్
- వెయిటేజ్, ఎక్స్‌పీరియన్స్ నై జాంతా
- గతంలో ఆగినచోటే మొదలెట్టిన వైనం
- శనివారం తెరపైకి కొత్త ఆదేశాలు
పాదర్శకతకు పాతర

సమగ్ర శిక్షలో ఏ ప్రాతిపదికన ఉద్యోగాల భర్తీకి నోటిఫికేషన్ వచ్చినా దానికి ఏదో శాపం ఉన్నట్టు కనిపిస్తుంది. వైకాపా ప్రభుత్వం అధికారంలో ఉన్నప్పుడు గత ఏడాది ఆగస్టులో పోస్టుల భర్తీకి ఇచ్చిన నోటిఫికేషన్‌లో ఏ తప్పులు చేశారో, ఇప్పుడు తాజాగా కూటమి ప్రభుత్వంలో ఇచ్చిన నోటిఫికేషన్‌లో కూడా అవే తప్పులు చేశారు. గతంలో భర్తీ కాకుండా ఉండిపోయిన పోస్టులను నింపాలని నోటిఫికేషన్ ఇచ్చి రోజుకో ఆదేశాలు, పూటకో ఉత్తర్వులతో గందరగోళం చేసిపారేస్తున్నారు. ఒక్క ముక్కలో చెప్పాలంటే ముందుగా అభ్యర్థులను నిర్ణయించుకొని, వారికి ఉద్యోగాలివ్వడం కోసం రోజుకో కొత్త నిబంధన, పాత నిబంధనల సడలింపు చేస్తున్నారు. గడిచిన రెండు రోజులుగా కేవలం తాము అనుకున్నవారిని పిలిపించి సర్టిఫికెట్లు వెరిఫికేషన్ చేసి ఉద్యోగాలు ఇస్తున్నారు. ఇందుకోసం దరఖాస్తులు తీసుకోవడం, రుసుము కట్టించుకోవడం, రోస్టర్ పాయింట్లు విడుదల చేయడం, వెయిటేజీ మార్కులు ఇవ్వడం.. ఇవన్నీ వట్టి బూటకం. కేవలం కూటమి నాయకులు చెప్పిన కొద్ది మందికి ఉద్యోగాలివ్వడం కోసం సర్వశిక్ష అధికారులు మొత్తం ఆడుతున్న నాటకం. వివరాల్లోకి వెళితే..

జిల్లా సర్వశిక్షలో టీచింగ్, నాన్‌టీచింగ్ స్టాఫ్ కోసం గత నెల 22న నోటిఫికేషన్ ఇచ్చారు. దీని ప్రకారం 16 పార్ట్‌టైమ్ ఉద్యోగులు, 3 పీజీటీ, 16 సీఆర్‌టీ ఉద్యోగాల భర్తీ జరపాల్సి ఉంది. అలాగే నాన్ టీచింగ్‌లో 3 వార్డెన్ పోస్టులు, 3 అకౌంటెంట్ పోస్టులు భర్తీ చేయాలి. ఇందుకోసం దరఖాస్తు చేసుకోడానికి ఈ నెల 12 వరకు సమయమిచ్చారు. ఇప్పుడు ఉద్యోగాల భర్తీ ప్రక్రియ ప్రారంభమైంది. అన్నీ నిబంధనల మేరకే చేశామని చెప్పుకోవడం కోసం మెరిట్ జాబితాను విడుదల చేశారు. కానీ ఇందులో అన్నీ గందరగోళాలే. ఒకే కుల రిజర్వేషన్, ఒకే ఎక్స్‌పీరియన్స్ ఉన్న ఏ ఇద్దరికీ ఒకేమాదిరిగా వెయిటేజీ మార్కులు ఇవ్వలేదు. పోనీ వెయిటేజీ మార్కుల ప్రకారం ఓవరాల్‌గా వచ్చిన పర్సంటేజీ ప్రకారం ఇంటర్వ్యూలకు పిలిచారా అంటే.. అదీ లేదు. 60.28 శాతం ఉన్నవారిని పక్కకు పెట్టి 55, 40 పాయింట్లు ఉన్నవారికి సర్టిఫికెట్ వెరిఫికేషన్‌కు పిలిచారు. ఒక సందర్భంలో నాన్ టీచింగ్ పోస్టులకు 1:10 నిష్పత్తిలో ఇంటర్వ్యూలకు పిలుస్తున్నామని, టీచింగ్ స్టాఫ్‌కు 1:20 నిష్పత్తిలో గుర్తించామని మొదట్లో చెప్పుకొచ్చారు. కానీ ఆ ప్రకారం శుక్రవారం, శనివారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరగలేదు. దీని మీద కొందరు అభ్యర్థులు ఆందోళన వ్యక్తం చేస్తే, వారి సందేహాలు నివృత్తి చేయడానికి ఆదివారం గ్రీవెన్స్ ఏర్పాటు చేసినట్లు పేర్కొన్నారు. కానీ అందులో దరఖాస్తుదారులు అడిగిన ఏ ప్రశ్నలకూ సర్వశిక్ష ఉద్యోగుల వద్ద జవాబు లేకుండాపోయింది. వాస్తవానికి ఓపెన్ కేటగిరీలో పోస్టులు తీస్తున్నామని నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. కానీ సర్టిఫికెట్ వెరిఫికేషన్ దగ్గరకొచ్చేసరికి ఎస్సీ రిజర్వుడు పోస్టులను మాత్రమే భర్తీ చేస్తున్నట్టు చెబుతున్నారు. శుక్రవారం సర్టిఫికెట్ల వెరిఫికేషన్‌కు దాదాపు 700 మంది హాజరయ్యారు. ఇందులో 386 మందిని లోపలికి పిలిచారు. శనివారం నాటికి సీన్ మారిపోయింది. గడిచిన ప్రభుత్వ హయాంలో ఏ కేటగిరీ వరకు ఉద్యోగాలు తీసి నిలిపేశారో, ఆ మిగిలిన రోస్టర్‌కు ఉద్యోగాలివ్వాలని సర్వశిక్ష స్టేట్ జీసీడీవో ఆదేశాలిచ్చినట్లు ఓ కాగితం చూపించి, కేవలం ఎస్సీ రిజర్వేషన్‌కు మాత్రమే భర్తీ చేస్తున్నామని మిగిలినవారిని వెనక్కు పంపించేశారు. వాస్తవానికి కొత్త నోటిఫికేషన్‌లో ఆ విషయం పేర్కొనలేదు. దీంతో చాలామంది దరఖాస్తు ఫీజు చెల్లించి మరీ అప్లై చేశారు. సోషల్ సీఆర్‌టీ పోస్టు జనరల్ కేటగిరీ అని పేర్కొనడంలో అనేకమంది దరఖాస్తు చేసుకున్నారు. కానీ ఇప్పుడు అది ఎస్సీ రిజర్వేషన్‌కు వెళ్తుందని చెబుతున్నారు. ఏ నిష్పత్తిలో ఇంటర్వ్యూకు పిలిచారో సర్వశిక్ష అధికారులు చెప్పలేకపోతున్నారు. ఎందుకంటే మెరిట్ జాబితా ప్రకారం 1:20లో ఉన్నవారు తమకు ఇంకా పిలుపు రాలేదని చూస్తున్నారు. వాస్తవానికి ఈ పోస్టులు ఎవరికి ఇవ్వాలనుకున్నారో వారి జాబితా ముందే ప్రిపేరయిపోయిందని, ఆ మేరకు వ్యక్తిగతంగా ఫోన్ చేసి సర్టిఫికెట్ల వెరిఫికేషన్ జరుగుతుందని పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతుంది.


APSS KGBV- Recruitment 2024

Tentative Merit List for Certificate Verification ( 1:20) - Category wise

| S.No | Category (1:20) | District as per Study /residence certificate | Candidate Name | Post | Application ID | DOB | Caste | Academic Qualifications | Professional Qualifications | Mobile No. | SSC | Inter | Degree | PG/ Bed | Teaching Exp | Total Score | Rank |
|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|---|
| 1 | SC-G | SRIKAKULAM | RAKOTI LAKSHMI SOWNDARYA KEERTHI | CRT SOCIAL SCIENCE | 240116219 | 19-06-1994 | SC | BA | B.ED. DEGREE WITHSOCIAL STUDIES / SOCIAL SCIENCES / GEOGRAPHY / HISTORY / POLITICS / POLITICAL SCIENCE/ ECONOMICS AS A METHODOLOGY SUBJECT.-B.Ed. | 9381706788 | 7.83 | 7.64 | 26.78 | 27.47 | 0 | 69.72 | 17 |
| 2 | SC-G | SRIKAKULAM | BIDDIKA CHANTI | CRT SOCIAL SCIENCE | 240145231 | 25-07-1993 | SC | Bachelors Degree with Telugu as the main subject (or) one of the three equal optional subjects | B.ED. DEGREE WITHSOCIAL STUDIES / SOCIAL SCIENCES / GEOGRAPHY / HISTORY / POLITICS / POLITICAL SCIENCE/ ECONOMICS AS A METHODOLOGY SUBJECT.-B.Ed. | 9515930145 | 7.57 | 6.76 | 29.81 | 24.98 | 0 | 69.12 | 21 |
| 3 | SC-G | SRIKAKULAM | RAYIBARIKI SWATHI | CRT SOCIAL SCIENCE | 240145774 | 12-06-1990 | SC | BA | B.ED. DEGREE WITHSOCIAL STUDIES / SOCIAL SCIENCES / GEOGRAPHY / HISTORY / POLITICS / POLITICAL SCIENCE/ ECONOMICS AS A METHODOLOGY SUBJECT.-B.Ed. | 8978091953 | 5.3 | 6.45 | 34.4 | 21.81 | 0 | 67.96 | 22 |
| 4 | SC-G | SRIKAKULAM | LOCHARLA SAILAJA | CRT SOCIAL SCIENCE | 240122190 | 23-06-1999 | SC | BA | B.ED. DEGREE WITHSOCIAL STUDIES / SOCIAL SCIENCES / GEOGRAPHY / HISTORY / POLITICS / POLITICAL SCIENCE/ ECONOMICS AS A METHODOLOGY SUBJECT.-B.Ed. | 6301264370 | 5.05 | 4.67 | 29.22 | 25.8 | 0 | 64.74 | 32 |
| 5 | SC-G | SRIKAKULAM | KONCHADA ROJA | CRT SOCIAL SCIENCE | 240157056 | 01-06-1992 | SC | BA | M.A., IN ECONOMICS- PG B.ED. DEGREE WITHSOCIAL STUDIES / SOCIAL SCIENCES / GEOGRAPHY / HISTORY / POLITICS / POLITICAL SCIENCE/ ECONOMICS AS A METHODOLOGY SUBJECT.-B.Ed. | 6301341474 | 4.03 | 7.26 | 25.64 | 26.62 | 0 | 63.55 | 43 |
| 6 | SC-G | SRIKAKULAM | YAJJALA PADMA | CRT SOCIAL SCIENCE | 240127121 | 28-07-1991 | SC | BA | B.ED. DEGREE WITHSOCIAL STUDIES / SOCIAL SCIENCES / GEOGRAPHY / HISTORY / POLITICS / POLITICAL SCIENCE/ ECONOMICS AS A METHODOLOGY SUBJECT.-B.Ed. | 9573729077 | 4.57 | 7.63 | 28.08 | 21.06 | 0 | 61.34 | 58 |
| 7 | SC-G | SRIKAKULAM | KUPPILI SRIDEVI | CRT SOCIAL SCIENCE | 240154326 | 01-05-1987 | SC | Others | B.ED. DEGREE WITHSOCIAL STUDIES / SOCIAL SCIENCES / GEOGRAPHY / HISTORY / POLITICS / POLITICAL SCIENCE/ ECONOMICS AS A METHODOLOGY SUBJECT.-B.Ed. | 7680047306 | 4.97 | 5.12 | 25.81 | 25.17 | 0 | 61.07 | 60 |
| 8 | SC-G | SRIKAKULAM | VARALAKSHMI KUMILI | CRT SOCIAL SCIENCE | 240135226 | 06-12-1979 | SC | BA | B.ED. DEGREE WITHSOCIAL STUDIES / SOCIAL SCIENCES / GEOGRAPHY / HISTORY / POLITICS / POLITICAL SCIENCE/ ECONOMICS AS A METHODOLOGY SUBJECT.-B.Ed. | 8978171838 | 5.83 | 6.08 | 21.37 | 22.18 | 5 | 60.46 | 65 |



• ఎడిటోరియల్

# పవన్‌కు ఇవి తెలుసా..?!

సనాతనవాదం పులి మీద స్వారీ వంటిది. ఒకసారి పులినెక్కిన వారు అది ఎక్కడికి తీసుకుపోతే అటు పోవాల్సిందే. వారాహి ప్రకటన సందర్భంగా చేసిన సనాతన విన్యాసాల మీద సామాజిక మాధ్యమంలో అనేక మంది అంతకంటే ఎక్కువగా స్పందించి చీల్చి చెండాడుతూ సంధించిన ప్రశ్నలకు ఎక్కడా సమాధానం రాలేదు. బహుశా ఇలా జరుగుతుందని అనుకొని ఉండరు. పవన్ కల్యాణ్ సనాతన ధర్మం గురించి వ్యతిరేకంగా మాట్లాడిన వారి మీద విరుచుకుపడిన మాటలు ఇంకా చెవుల్లో మోగుతుండగానే సనాతనులకు తామే బ్రాండ్ అంబాసిడర్లమని చెప్పుకొనేవారు చేసిన పనికి సభ్య సమాజం సిగ్గుపడింది. ప్రముఖ జర్నలిస్టు గౌరీ లంకేష్‌ను కాల్చి చంపిన కేసులో నిందితులైన పరశురామ్ వాగ్మోరే, మనోహర్ అనే వారిని కర్ణాటక సనాతన లేదా హిందూత్వ శక్తులు విజయపురాలో 2024 అక్టోబరు 11న సన్మానించాయి. పవన్ కల్యాణ్ ఈ వార్తను చదివారో లేదో తెలియదు. ఒకవేళ చదివినా ఆ కేసులోని వారు ఇంకా నిందితులే తప్ప నేరం రుజువు కాలేదుగా అని లా పాయింట్ తీసి సనాతనులను సమర్ధించవచ్చు. అందుకే మరికొన్ని ఉదంతాలను పేర్కొనాల్సి వస్తోంది. గుజరాత్‌లో బిల్కిస్ బానోపై గోద్రా అనంతర మారణకాండ సందర్భంగా సామూహిక అత్యాచారం చేసి ఆమె కుటుంబ సభ్యులందరినీ హత్య చేసిన సంగతి తెలిసిందే. అత్యాచార కేసులో నేరగాళ్లలో పరివర్తన కలిగి మంచివారుగా మారారంటూ అక్కడి సనాతనవాదుల ఏలుబడిలోని రాష్ట్ర ప్రభుత్వం జైలు నుంచి విడుదల చేసింది. ఆ సందర్భంగా వారిని సనాతన ధర్మాన్ని లేదా హిందూత్వను కాపాడేందుకు కంకణం కట్టుకున్నట్లు చెప్పుకొనేవారు సన్మానం చేసి, మిఠాయిలు పంచారు. సుప్రీం కోర్టు ఇటీవల వెలువరించిన తీర్పు ప్రకారం అత్యాచారం కేసులో యావజ్జీవ శిక్ష పడినవారు జైల్లో ఉండాల్సిందే. అయితే సదరు సదాచార సనాతనుల కేసులో ఆ తీర్పు రాక ముందే శిక్ష విధించినందున తర్వాత వచ్చిన తీర్పు వారికి వర్తించదని, పాత నిబంధనల ప్రకారం వారి సత్ప్రవర్తకు మెచ్చి మేకతోలు కప్పి ముందుగానే జైలు నుంచి విడుదల చేయాలని నిర్ణయించినట్లు రాష్ట్ర ప్రభుత్వం వాదించింది. అయితే సుప్రీం కోర్టు ఆ చర్యను తప్పు పట్టి నేరగాళ్లను తిరిగి జైలుకు పంపింది. దీని మీద పవన్ కల్యాణ్ ఏమంటారో? సకల కళావల్లభుడిగా పేరుగాంచిన హంతకుడు, ఇద్దరు మహిళలపై అత్యాచార నేరగాడు, ప్రవచనకారుడు డేరా బాబా జీవిత ఖైదు అనుభవిస్తూ బెయిల్ మీద వచ్చినపుడు హర్యానా బీజేపీ నేతలు ఆశీస్సులు పొందారు. అతగాడి అనుచరుల ఓట్లు పొందేందుకు గాను తాజా హర్యానా అసెంబ్లీ ఎన్నికలకు ముందు పెరోల్ మీద బీజేపీ ప్రభుత్వం విడుదల చేసిందనే విమర్శలు వచ్చాయి. 2018లో జమ్మూలోని కథువాలో ఒక బాలికపై అత్యాచారానికి పాల్పడిన వారికి మద్దతుగా అక్కడ హిందూ ఏక్తా మంచ్ పేరుతో జరిపిన ప్రదర్శన తెలిసిందే. మహిళను దేవతగా కొలిచే సమాజంలో దాని గురించి రోజూ ప్రవచనాలు చెప్పే శక్తులే ఈ ఉదంతాలకు పాల్పడ్డాయంటే దేశం ఎటుపోతోందని కాదు, కొంతమంది ఎటు తీసుకుపోతున్నారో జనం ఆలోచించాలి. డేరాబాబాకు 2017లో శిక్ష పడింది, అప్పటి నుంచి ఉత్తరాదిన ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ పెరోల్ ఇవ్వటం గమనించాల్సిన అంశం. బిల్కిస్ బానో ఉదంతంలో నేరస్థులను సమర్ధించటంలో మతాన్ని కూడా జోడించిన దుర్మార్గం, దాన్ని నిస్సిగ్గుగా సమర్ధించిన ఉన్మాదం కనిపిస్తుంది. వారంతా సనాతనులే. మతాలతో నిమిత్తం లేకుండా అత్యాచారం ఎవరి మీద జరిగినా దాన్ని ఖండించాల్సిందే. 2014 లోక్‌సభ ఎన్నికల ప్రచారంలో ఢిల్లీ నిర్భయ కేసును ప్రస్తావించిన మోడీ తమ ఏలుబడిలో జరిగిన కథువా, ఉన్నావో అత్యాచారాల తర్వాత మాట్లాడుతూ సాధారణ పరిభాషలో ఖండించారే తప్ప వాటి ప్రస్తావన ఎక్కడా తేలేదు. ఎందుకంటే కథువా ఉదంతంలో నిందితులకు మద్దతుగా బీజేపీ మంత్రులు కూడా ప్రదర్శనల్లో పాల్గొన్నారు. వారిని మంత్రివర్గం నుంచి బర్తరఫ్ చేయాల్సి ఉండగా విమర్శలు పెరగటంతో తీరికగా తర్వాత రాజీనామా చేయించారు. ఉన్నావో ఉదంతంలో బీజేపీ ఎంఎల్ఏ దోషి, ఇప్పుడు జీవితకాల ఖైదు అనుభవిస్తున్నాడు. గత రెండేళ్లలో ఆ రాష్ట్ర బీజేపీ ప్రభుత్వం డేరాబాబాకు పదకొండుసార్లు బెయిల్ ఇచ్చి బయటకు వదిలింది. ఏడుసార్లు వేర్వేరు చోట్ల ఎన్నికలకు ముందు బెయిల్ ఇచ్చారు. తాజాగా ఎన్నికలకు కొద్ది రోజుల ముందు అదే జరిగింది. బీజేపీకి ఓటు వేయాల్సిందిగా అనుచరులకు సందేశం పంపాడు. అతగాడి ఆశ్రమం ఉన్న సిర్సా జిల్లాలోని ఐదు అసెంబ్లీ సీట్లలో బీజేపీకి ఒక్కటి కూడా దక్కలేదు. సనాతనవాదుల మందలో కొత్తగా చేరిన పవన్ తాను ఎన్నో చదివానని చెప్పిన తర్వాత ఆ వాదాన్ని భుజాన వేసుకున్నారు గనుక అమాయకుడని అనుకోలేం. మర్రిచెట్టు వంటి చంద్రబాబు నీడలో ఎంతకాలం ఉన్నా ఎదుగూ బొదుగూ ఉండదు కనుక తాను ప్రత్యేకంగా కనిపించాలంటే సనాతనాన్ని భుజాన వేసుకున్నట్లు కొందరు చెబుతున్నారు.

# శ్రీ సుబ్రహ్మణ్య స్వామికి అష్టోత్తర పుస్తకార్చన



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలోని తిరుపతి జిల్లా మల్లాం క్షేత్రంలో గల శ్రీ వల్లీదేవసేనా సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవస్థానం 11వ శతాబ్దం నాటిదిగా అద్భుత నిర్మాణంతో విరాజిల్లుతోంది. కాశిన వెంకటేశ్వరరావు, రమణమ్మ దంపతులు స్వీయరచనగా శ్రీ కార్తికేయ వైభవం అనే 108 పుస్తకాలతో విశ్వజయము గ్రూప్ సభ్యుల శ్రేయస్సు కోసం అక్కడి ఆలయంలోని స్వామికి అర్చన జరిపించి వాటిని భక్తులకు వితరణ చేయమని ఈవో వై.శశాంక్‌కుమార్‌కు అందజేశారు. ఈ పుస్తకంలో 108 సుబ్రహ్మణ్యస్వామి పురాణ ప్రసిద్ధ, విచిత్ర, సుప్రసిద్ధ క్షేత్రాల వివరాలను, స్వామి చరిత్ర, ఆరాధనా స్తోత్రాలను పొందుపర్చినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ కె.మునిశేఖర్ రెడ్డి, ప్రధానార్చకులు భాను ప్రకాష్, కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

అద్దెకొరకు
శ్రీకాకుళంలో డే అండ్ నైట్ జంక్షన్ వద్ద గల లయా ల్యాబ్ బిల్డింగ్‌లోని సెకండ్ ఫ్లోర్, థర్డ్ ఫ్లోర్ (22X150) కామన్ హాల్ మెడికల్ హోల్‌సేల్ షాపులకు గాని, డాక్టర్ ప్లాజాకు గాని, ఆఫీసులకు గాని అద్దెకు ఇవ్వబడును.
- సంప్రదించగలరు -
94403 72300,
98487 96626




## మాజీ కౌన్సిలర్ హఠాన్మరణం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

మాజీ కౌన్సిలర్ సిగిరెడ్డి నాగు ఆదివారం గుండెపోటుతో ఆకస్మికంగా మృతిచెందారు. స్థానిక ఆరంగివీధిలో ఆయన నివాసంలో మధ్యాహ్నం భోజన అనంతరం తీవ్రమైన గుండెనొప్పి రావడంతో ఇంట్లోనే కుప్పకూలిపోయారు. 2000 నుంచి 2005 వరకు ఆయన కౌన్సిలర్‌గా వ్యవహరించారు. 2005లో మరోసారి పోటీ చేసి ఓడిపోయారు. నాగుకు భార్య, ఇద్దరు కుమారులు ఉన్నారు.













# శ్రీదేవి బతికుండగానే అంత నరకం చూసిందా?



దివంగత అతిలోక అందాల సుందరి శ్రీదేవి గురించి భారతీయ సినీ ప్రేక్షకులకు ప్రత్యేకంగా పరిచయం అవసరం లేదు. 55 సంవత్సరాల వయసులోనే దుబాయ్‌లో ఫంక్షన్‌కి వెళ్ళిన శ్రీదేవి అక్కడే బాత్రూం టబ్లో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన సంగతి తెలిసిందే. శ్రీదేవి వాస్తవంగా తమిళ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన అమ్మాయి. అయినా ఆమె కుటుంబం మూలాలు అన్ని ఆంధ్రప్రదేశ్‌లో తిరుపతిలోనే ఉన్నాయి. శ్రీదేవి తమిళ బ్రాహ్మణ కుటుంబానికి చెందిన అమ్మాయి అయినా.. ఆమెకు తిరుగులేని స్టార్టింగ్ కట్టబెట్టింది మాత్రం తెలుగు సినీ ప్రేమికులు. ఆ తర్వాత తమిళంలోనూ ఆమె తిరుగులేని స్టార్ హీరోయిన్గా ఒక వెలుగు వెలిగింది. ఆ తర్వాత బాలీవుడ్‌కి వెళ్లి అక్కడ మకుటం లేని మహారాణిలా వెలిగిపోయింది. హిందీ సినీ ప్రేమికులు శ్రీదేవిని అతిలోకసుందరిగా ఆరాధించారు. ఈ క్రమంలోనే ఆమె కెరీర్ పరంగా కొన్ని తప్పులు చేసింది. అప్పటికే పెళ్ళయి పిల్లలు ఉన్న బోనికపూర్ మాయలోపడిన శ్రీదేవి.. అతడి జీవితంలోకి రెండో భార్యగా వెళ్ళింది. ఆ తర్వాత శ్రీదేవిని తన ఆర్థిక అవసరాలకు బాగా వాడుకున్న బోణీకపూర్‌కు స్వార్థం బాగా పెరిగిపోయింది. తన కొడుకు అర్జున్ కపూర్ సినిమాలకు శ్రీదేవి దగ్గర డబ్బులు తీసుకుని పెట్టుబడులు పెట్టించడం.. ఆమెను ఆర్థికంగా దివాలాతీసే వరకు వాడుకోవడం.. చకచకా జరిగిపోయాయి. జాన్వీ కపూర్ కడుపులో ఉండగా బోనీ మొదటి భార్య అయితే.. శ్రీదేవిని కడుపులో బలంగా తన్నడంతో ఆ బాధతో శ్రీదేవి విలవిలలాడిపోయిందన్న ప్రచారం కూడా ఉంది. ఇదే విషయాన్ని శ్రీదేవి.. బోనికి చెప్పుకుని బాధపడ్డా ఏనాడు అస్సలు పట్టించుకోలేదట. అర్జున్ కపూర్ అయితే.. శ్రీదేవుని జుట్టు పట్టుకుని బయటకు ఈడ్చుకుంటూ వెళ్లిన సందర్భాలు కూడా ఉన్నాయి. శ్రీదేవి తన కెరీర్ చివరి దశలో ఎన్నో బాధలు పడింది. అప్పటికి గాని ఆమెకు తాను బోణి కపూర్‌ను పెళ్లి చేసుకుని ఎంత పెద్ద తప్పు చేశాను అన్న విషయం తెలిసి రాలేదు. అప్పటికే ఆమెకు జరగాల్సిన నష్టం జరిగిపోయింది. శ్రీదేవి ఆర్థికంగా కూడా కొంతవరకు దెబ్బతింది. అలా శ్రీదేవి తన కెరీర్లో బోనికపూర్ మాయలో పడి కెరీర్ను అర్ధాంతరంగా ముగిసేలా చేసింది.

– తెలుగులైవ్స్.కామ్ సౌజన్యంతో...

# రుక్మిణి.. ద క్యూట్ బేబీ!

'సప్తసాగరాలు దాటి' మూవీతో హీరోయిన్‌గా అందరి దృష్టిని ఆకర్షించిన బ్యూటీ రుక్మిణి వసంత్. ఈ కన్నడ భామకి 'బీర్బల్' అనే సినిమాతో హీరోయిన్ గా తెరంగేట్రం చేసింది. తరువాత హిందీలో 'అప్ స్టైర్స్' అనే మూవీలో నటించింది. అయితే రక్షిత్ శెట్టికి జోడీగా చేసిన 'సప్తసాగరాలు దాటి సిరీస్' మాత్రం ఆమెకి స్టార్ హీరోయిన్ ఇమేజ్ తీసుకొచ్చింది. ఈ సినిమా తర్వాత వెనక్కి తిరిగిచూసుకునే అవకాశం లేకుండా వరుసఛాన్స్‌లు అందుకుంటుంది. కన్నడంలో శ్రీమురళీకి జోడీగా 'భఘీర సినిమాలో రుక్మిణి వసంత్ నటించింది. ఈ మూవీ రిలీజ్ కి రెడీ అవుతోంది. మరో వైపు తెలుగులో నిఖిల్ కి జోడీగా 'అప్పుడో ఇప్పుడో ఎప్పుడో' అనే చిత్రంలో నటిస్తోంది. సుధీర్ వర్మ దర్శకత్వంలో ఈ మూవీ తెరకెక్కుతోంది. ఇక కన్నడంలో శివరాజ్ కుమార్ తో 'భారతీ రంగల్' చిత్రంలో చేస్తోంది. వీటితో పాటు తమిళంలో విజయ్ సేతుపతికి జోడీగా 'ఏస్' అనే మూవీలో నటిస్తోంది. అలాగే శివ కార్తికేయన్ హీరోగా మురుగదాస్ దర్శకత్వంలో తెరకెక్కుతోన్న చిత్రంలో కూడా హీరోయిన్ గా కన్ఫర్మ్ అయ్యింది. ఇలా ప్రస్తుతం రుక్మిణి వసంత్ చేతిలో అరడజను సినిమాల వరకు ఉన్నాయి. ఇదిలా ఉంటే ఎన్టీఆర్ హీరోగా ప్రశాంత్‌నీల్ దర్శకత్వంలో తెరకెక్కనున్న సినిమాలో హీరోయిన్ గా రుక్మిణి వసంత్ పేరు వినిపిస్తోంది. ఇప్పటికే ఆమె ప్రాజెక్ట్ కోసం సైన్ చేసిందని టాక్ నడుస్తోంది. ఇలా చేతి నిండా ప్రాజెక్ట్స్ తో రుక్మిణి వసంత్ హీరోయిన్‌గా స్టార్ ఇమేజ్ దిశగా దూసుకుపోతోంది. తెలుగులో కూడా చాలా ప్రాజెక్ట్స్ కోసం ఈమె పేరు వినిపిస్తోంది. ఇదిలా ఉంటే సోషల్ మీడియాలో రుక్మిణి చాలా యాక్టివ్ గా ఉంటుంది. రెగ్యులర్‌గా తన మూవీ అప్డేట్స్‌తో గ్లామర్ ఫోటోలని కూడా షేర్ చేస్తూ ఉంటుంది. ఈ ఫోటోలకి ఆమె ఫ్యాన్స్‌తో పాటు నెటిజన్లు నుంచి అదిరిపోయే రేంజ్‌లో కామెంట్స్ వస్తాయి. తాజాగా ఇన్‌స్టాగ్రామ్‌లో రుక్మిణి వసంత్ సోఫా చైర్ లో కూర్చొని ప్యాంటు, టాప్‌తో ఉన్న ఒక ఫోటోలు షేర్ చేసింది. ఈ ఫోటోలో రుక్మిణి చాలా స్టైలిష్ గా కనిపిస్తోంది. లుక్స్ తో మెస్మరైజ్ చేస్తోంది. ఈ ఫోటోలు ఇప్పుడు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి.

– తుపాకి.కామ్ సౌజన్యంతో...





# పుష్ప-2లో శ్రద్ధాకపూర్ చేరిందా?!


పుష్ప–2'లో ఐటెమ్ గీతం ఉంది. అందులో ఎవరు నటించబోతున్నారు? ఈసారి సుకుమార్ ఏ కథానాయికని ఐటెమ్ గాళ్‌గా పరిచయం చేయబోతున్నారు? అనే ఆసక్తి సర్వత్రా ఉంది. ఈ జాబితాలో చాలామంది పేర్లు వినిపించాయి. శ్రీలీల, జాన్వీ, ద్రీప్తి.. ఇలా 'పుష్ప 2' ఐటెమ్ గీతం చాలామంది చుట్టూ తిరిగింది. ఎట్టకేలకు శ్రద్ధాకపూర్‌కు ఈ అవకాశం అందినట్టు సమాచారం అందుతోంది. ఐటెమ్ గాళ్‌గా శ్రద్ధా కపూర్ ఎంపిక ఖాయమైందని, ఆమెకు అడ్వాన్సు కూడా ఇచ్చేశారన్న ఓ వార్త టాలీవుడ్‌లో చక్కర్లు కొడుతోంది. ఇటీవల చిత్రబృందం శ్రద్ధాకపూర్‌ని సంప్రదించిన మాట వాస్తవం. జాన్వీ కంటే శ్రద్ధా బెటర్ ఆప్షన్ అని సుకుమార్ కూడా భావిస్తున్నారు. పైగా 'స్త్రీ 2'తో ఓ మంచి హిట్ కొట్టింది శ్రద్ధా. అందుకే ఐటెమ్‌సాంగ్ ఛాన్స్ శ్రద్ధాని వరించిందని చెబుతున్నారు. ఈ పాట కోసం శ్రద్ధా కపూర్ రూ.4 కోట్లు డిమాండ్ చేసిందని, అడిగినంత ఇవ్వడానికి మైత్రీ మూవీస్ కూడా సిద్ధమైందని తెలుస్తోంది. నవంబరులో ఈ పాటని తెరకెక్కిస్తారు. దీంతో పాటు మరో పాట కూడా బాలెన్స్ వుంది. ఈ పాట సైతం నవంబరులోనే పూర్తవుతుంది. ప్రస్తుతం 'పుష్ప–2' సెకండాఫ్ పనులు ముమ్మరంగా జరుగుతున్నాయి. ఈ దీపావళికి 'పుష్ప–2' నుంచి ఓ సర్‌ప్రైజ్ ఉండొచ్చని అభిమానులు భావిస్తున్నారు. డిసెంబరు 6న ప్రపంచవ్యాప్తంగా ఈ చిత్రాన్ని విడుదల చేస్తున్న సంగతి తెలిసిందే. అంతకు ముందు రోజే ప్రీమియర్లు కూడా గట్టిగా ప్లాన్ చేశారు.

– తెలుగు 360.కామ్ సౌజన్యంతో...

## అన్నా క్యాంటీన్లకు నిర్వహణకు విరాళం

(సత్యంన్యూస్, టెక్కలి)

హిందూపురం ఎమ్మెల్యే నందమూరి బాలకృష్ణ జన్మదినం సందర్భంగా జూన్ 10న శ్రీకాకుళం జిల్లా ఎన్టీఆర్ మోక్షజ్ఞ సేవా సంఘం, డేవిడ్ మిత్రబృందం శ్రీకాకుళంలో పునః ప్రారంభించిన అన్న క్యాంటీన్లకు ఆరోజు రూ.20వేలు రాష్ట్ర కింజరాపు అచ్చెన్నాయుడు చేతుల మీదుగా శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్‌కు అందించారు. టెక్కలిలో రెండు అన్నా క్యాంటీన్లకు కూడా ఎన్టీఆర్ మోక్షజ్ఞ సేవా సంఘం తరఫున రూ.20 అందిస్తామని అప్పట్లో మాటిచ్చారు. ఆమేరకు నిమ్మాడలోని అచ్చెన్నాయుడు క్యాంప్ కార్యాలయంలో శ్రీకాకుళం జిల్లా ఎన్టీఆర్ మోక్షజ్ఞ సేవా సంఘం తరఫున టెక్కలి అన్నా క్యాంటీన్‌కు రూ.20వేలు అందించారు. ఈ కార్యక్రమంలో శ్రీకాకుళం జిల్లా ఎన్టీఆర్ మోక్షజ్ఞ సేవా సంఘం గౌరవాధ్యక్షులు, శ్రీకాకుళం నగర తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మాదారపు వెంకటేష్, డేవిడ్ తదితరులు పాల్గొన్నారు.



## పీఎంపీ అసోసియేషన్ ఉచిత వైద్యశిబిరం

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

కలెక్టర్ కార్యాలయ ఆవరణలో ఆదిత్య వాకర్స్‌క్లబ్ సభ్యులకు పీఎంపీ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. థైరాయిడ్, షుగరు, బీపీ తదితర పరీక్షలు ఉచితంగా నిర్వహించారు. ప్రముఖ నేత్ర వైద్యులు డాక్టర్ పీఎల్ఎన్ రాజు, డాక్టర్ ఎల్.సోమశేఖరరావు, పీఎంపీ అధ్యక్షులు వండాన శిమ్మన్న, సెక్రటరీ నక్క లక్ష్మీనారాయణ, క్లబ్ వ్యవస్థాపక అధ్యక్షులు పోలుమహంతి ఉమామహేశ్వరరావు, క్లబ్ అధ్యక్షులు గౌరీశంకర్‌రావు, సుమారు వందమంది సభ్యులు పాల్గొన్నారు. పీఎంపి సభ్యులందరికీ ఆదిత్య వాకర్స్ క్లబ్బు ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు పీఎంపీ సేవలను కొనియాడారు. కార్యక్రమంలో ట్రెజరర్ కె.జనార్ధనరావు, జాయింట్ సెక్రటరీ చిన్నాల రాములు, సీనియర్ సభ్యులు మంగరాజు లవుడు, డోల వాసు, గొర్ల రాము తదితరులు పాల్గొన్నారు.




## దాడి చేసినవారిని తక్షణమే అరెస్టుచేయాలి



(సత్యంన్యూస్, మెళియాపుట్టి)

జలుమూరు మండలం ఎస్టీ మాకివలస ఆదివాసి మహిళలపై శనివారం రాత్రి సమయంలో గ్రామంలో హరేరామ హరేకృష్ణ సభ్యులు చొరబడి దాడి చేశారని, నిందితులను తక్షణమే అరెస్టు చేయాలని ఆదివాసీ సంక్షేమ పరిషత్ మండల అధ్యక్షులు ఎస్.గణేష్ డిమాండ్ చేశారు. రాత్రి సమయంలో ఆదివాసులను భయభ్రాంతులకు గురిచేయడమే కాకుండా ఆదివాసి మహిళలపై అసభ్యకరంగా ప్రవర్తించి దాడిచేసిన సంఘటన అమానుషమన్నారు. దాడి సంగతిపై ఎమ్మెల్యే స్పందించకపోవడం చాలా దారుణమని, ప్రభుత్వాలు తక్షణమే స్పందించి ఎస్టీ మాకివలస గ్రామంలో ఆదివాసీలకు రక్షణ కల్పించాలన్నారు. దాడిచేసిన వారికి తక్షణం అరెస్టు చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సవర వెంకటేష్, భాస్కరరావు, ఎస్.ధర్మారావు, ఎస్.లోకేష్ పాల్గొన్నారు.

## బహుముఖ ప్రజ్ఞాశాలి డాక్టర్ వాసుదేవాచారి

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

యుఎస్ఏకు చెందిన బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డు నుంచి ప్రపంచ వ్యాప్తంగా పాల్గొని వరల్డ్ రికార్డు సాధించిన ఐదుగురు వ్యక్తుల్లో డాక్టర్ మంతిన వాసుదేవాచారి ఉండడం జిల్లాకు ఎంతో గర్వకారణమని వివిధరంగాల ప్రముఖులు అన్నారు. గజల్స్ గాయకుడు, వ్యాయామ ఉపాధ్యాయుడు, కవి, రచయిత డాక్టర్ మంతిన వాసుదేవాచారిని నగరంలోని జీటీ రోడ్డులో ఉన్న ఆదిత్య ఇన్ హోటల్లో ఆదివారం రాత్రి వివిధ రంగాల ప్రముఖులు సత్కరించారు. ఉత్తమ ఉపాధ్యాయుడిగా రాష్ట్ర ప్రభుత్వం నుంచి అవార్డు అందుకోవడంతో పాటు 46 పురస్కారాలు అందుకున్న వాసుదేవాచారి వరల్డ్ బుక్ ఆఫ్ రికార్డులో స్థానం సాధించడంతో పాటు అంతర్జాతీయ స్థాయిలో లైఫ్ టైం అచీవ్మెంట్ అవార్డు సాధించడం చారిత్రక పరిణామమని జేసీఐ సెనేటర్, రోటరీ లయన్స్ ఇంటర్నేషనల్ సంస్థ ప్రతినిధి నటుకుల మోహన్, వాకర్స్ ఇంటర్నేషనల్ పూర్వపు గవర్నర్లు జి.ఇందిరాప్రసాద్, కె.వి.రమణమూర్తి, గుడ్ల సత్యనారాయణ, పి.జి.గుప్తా, ఎలక్ట్ గవర్నర్ కొంక్యాన మురళీధర్, డిప్యూటీ గవర్నర్ సంజీవరావు, మీడియా జేఏసీ నేతలు కొంక్యాన వేణుగోపాల్, ఎస్.జోగినాయుడు అన్నారు. వివిధ రంగాలకు వాసుదేవాచారి అందించిన సేవలను వాకర్స్ క్లబ్ ప్రతినిధులు బి.వి.రవిశంకర్, సూర్యారావు, దేవీప్రసాద్, సంతోష్, ఉమామహేశ్వర్, రమేష్, పీడీ రమణమూర్తి ప్రశంసించారు. ఈ సందర్భంగా వివిధ సంస్థల ప్రతినిధులు వాసుదేవాచారిని సత్కరించారు.



## ప్రాచీన, నవీన సంప్రదాయాల సంఘర్షణలే 'వంశవృక్షం'



(సత్యంన్యూస్, రాజాం)

ప్రాచీన సనాతన ధర్మం, నవీన సంప్రదాయం మధ్య జరిగిన సంఘర్షణల సమ్మేళనమే వంశవృక్షం నవల అని ప్రముఖ సాహితీ బంధువు పొదిలాపు శ్రీనివాసరావు పేర్కొన్నారు. ఆదివారం స్థానిక వేద గాయత్రీ జూనియర్ కళాశాలలో రాజాం రచయితల వేదిక 117వ సమావేశం జరిగింది. ఈ సమావేశంలో శ్రీనివాసరావు ప్రఖ్యాత కన్నడ రచయిత పద్మవిభూషణ్ బహుమతి గ్రహీత ఎస్.బైరప్ప రచించిన వంశవృక్షం నవల మీద విశ్లేషణాత్మక ప్రసంగం చేశారు. సనాతన సంప్రదాయబద్ధులైన వ్యక్తులు, ఆధునికంగా వ్యవహరించే వ్యక్తుల జీవితాలనే బైరప్ప నవలగా తీర్చిదిద్దారని చెప్పారు. ఇది చదివిన పాఠకుడు ఈ రెండింటి సంప్రదాయాల సంఘర్షణను అనుభవిస్తాడని ఆయన వివరించారు. నవల్లోని పాత్రల మానసిక సంఘర్షణలను చక్కగా పట్టి ఇందులో రాయడం ద్వారా పాఠకునిలో సాంఘిక చైతన్యాన్ని కలిగించడమే రచయిత ఉద్దేశమని చెప్పారు. ఎక్కడ సనాతన సంప్రదాయం గొప్ప ఒత్తిడిని కలిగిస్తుందో ఆ ఇంట్లో స్త్రీ స్వేచ్ఛను కోల్పోతుందని శ్రీనివాసరావు అభిప్రాయపడ్డారు. రౌతు గణపతిరావునాయుడు అధ్యక్షతన జరిగిన సమావేశంలో వేదిక సభ్యులు శ్రీనివాసరావుని సత్కరించారు. ఈ సమావేశంలో వేదిక నిర్వాహకుడు గార రంగనాథం, పెంకి దయానిధి నాయుడు, పిల్లా తిరుపతిరావు, ఒమ్మి రమణమూర్తి, డాక్టర్ ఆల్తి మోహన్రావు, రౌతు నిర్మల, తురంగి విశ్వనాథం, రాజాపు శాంతారావు, మూడడ్ల శ్రీనివాసరావు, పడాల కవీశ్వరరావు, సమతం మహేశ్వరరావు, ఉరిటి గున్నేశ్వరరావు, కుదమ తిరుమలరావు, ఆర్.కిషోర్‌కుమార్, ఉరిటి రామలింగేశ్వరరావు, అంబళ్ల రామమూర్తి, మజ్జి నాగరాజు, గ్రంధి సాయి సూర్యారావు తదితరులు పాల్గొన్నారు.


## పాస్‌పోర్ట్ పోయినది

నా పేరు చౌదరి నవీన్‌కుమార్. నా పాస్‌పోర్ట్ నెంబర్ : S5314629. నేను శ్రీకాకుళం ఏడురోడ్ల జంక్షన్ నుంచి ఆర్టీసీ కాంప్లెక్స్ వైపు వెళుతుండగా ఎక్కడో జారిపడిపోయినది. కావున దొరికిన వారు ఈ క్రింద చిరునామాకు తెలియజేయగలరు

CHOWDARI NAVEEN KUMAR
S/0 CH ADINARAYANA, Opp Padalamma Temple,
Janachaitanya Apartment, Sana Street,
SRIKAKULAM -532001, PH NO : 888 22 06307


## గౌరీశ్వరరావుకు రైతునేస్తం పురస్కారం




(సత్యంన్యూస్, వంగర)

ప్రకృతి వ్యవసాయం రైతు, రాష్ట్రపతి అవార్డు గ్రహీత, పెంకి గౌరీశ్వరరావుకు ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకిచ్చి గౌరవించే రైతు నేస్తం పురస్కారాన్ని పూర్వ ఉపరాష్ట్రపతి ఎం.వెంకయ్యనాయుడు గన్నవరం దరిలోని ఆత్కూరులో అందజేసారు. భారతిట్రస్ట్‌లో మెమెంటో, సర్టిఫికేట్ అందజేసి గౌరీశ్వరరావును ఘనంగా సత్కరించారు. రైతు నేస్తం ఫౌండేషన్ వారు దివంగత డాక్టర్ ఐవీ సుబ్బారావు పేరిట ఈ అవార్డులను అంకిత భావంతో ప్రకృతి వ్యవసాయం చేసే రైతులకు అందజేసి గౌరవిస్తున్నారు. గౌరీశ్వరరావు గత పదేళ్లుగా విజయనగరం జిల్లా వంగర మండలం కె.కొత్తవలస గ్రామ పరిధిలో రెండెకరాల భూమిలో దేశవాళీ వరి, పెసలు మినుములు, నువ్వులు వంటి పంటలు పండిస్తున్నారు. ప్రతి ఏటా మార్చిలో పలు రకాల పంటలు వేసి ఫలితాలను తీసిన అనంతరం మిగిలిన పంటలు కలియదున్నుతారు. మే నెలలో గొర్రెల మందలు ఆయిస్తారు. మరలా రుతుపవనాల ముందు పచ్చిరొట్ట విత్తనాలను వేసి పూతదశలో కలియదున్ని అనంతరం వరినాట్లు వేసి చేప ద్రావణాన్ని కలిపి వేసి రసాయన ఎరువుల పంటలకు దీటుగా దిగుబడులు సాగిస్తున్నారు. మెట్ట బూమిలో మామిడి, జీడి, సపోట వంటి పండ్ల తోటలలో పచ్చిరొట్ట ఎరువులు వేసి పంట వైవిధ్యాన్ని పాటించి పలు పంటలు పండిస్తున్నారు. ప్రస్తుతం పొలంలో ఉన్న ఈ పంటలు ఆగస్టు నెల చివర్లో హైదరాబాద్ నుంచి రైతునేస్తం ఫౌండేషన్ బృందం పరిశీలించి ఈ అవార్డుకు ఎంపిక చేసారు.

## రాష్ట్ర కార్యదర్శిగా అరుణ్‌కుమార్



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ఆంధ్రప్రదేశ్ టైపిస్టు, స్టెనోగ్రాఫర్ల సంఘ రాష్ట్ర కార్యదర్శిగా కళ్లేపల్లి అరుణకుమార్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. ఆదివారం గుంటూరులోని నిర్వహించిన సంఘ ఎన్నికల్లో నూతన కమిటీని ఎన్నికల అధికారులు నాగభూషణం, శివరామకృష్ణలు ప్రకటించారు. అనంతరం అరుణ్‌కుమార్‌ను రాష్ట్ర సంఘ నాయకులు సన్మానించారు. అరుణ్‌కుమార్ ఎంపిక పట్ల శ్రీకాకుళం తహసీల్దార్ కార్యాలయ అధికారులు, సిబ్బంది హర్షం వ్యక్తం చేశారు.

## హరిప్రసాద్ కిడ్నీసెంటర్ ప్రారంభం



(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

స్థానిక రిమ్స్ ఆసుపత్రి మెయిన్ గేట్ వద్ద హరిప్రసాద్ కిడ్నీ సెంటర్ ఆదివారం ఘనంగా ప్రారంభమైంది. జిల్లాలో సుదీర్ఘ కాలంగా యూరాలజీ వైద్యుడిగా వివిధ ఆసుపత్రుల్లో సేవలందిస్తున్న డాక్టర్ దుంపల హరిప్రసాద్ సొంతంగా కిడ్నీ సెంటర్‌ను ప్రారంభించడం ముదావహమని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ మాట్లాడుతూ కిడ్నీసెంటర్‌తో పాటు మిగిలిన విభాగాల సేవలు కూడా రిమ్స్‌కు దగ్గరలోనే అందుబాటులోకి రావడం మంచి పరిణామమన్నారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి మాట్లాడుతూ శ్రీకాకుళం లాంటి ప్రాంతంలో కిడ్నీ రోగుల కోసం ప్రత్యేక ఆసుపత్రి ఉండటం మంచిదన్నారు. మాజీమంత్రి ధర్మాన ప్రసాదరావు మాట్లాడుతూ హరిప్రసాద్ సేవలు మరింత విస్తృతం కావడానికి ఆసుపత్రి ఉపయోగపడుతుందన్నారు. ఈ కార్యక్రమంలో మాజీ స్పీకర్ తమ్మినేని సీతారాం, మాజీ కేంద్ర మంత్రి కిల్లి కృపారాణి, ఎమ్మెల్సీ దువ్వాడ శ్రీను, పేరాడ తిలక్, మాజీమంత్రి సీదిరి అప్పలరాజు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి, డాక్టర్ దానేటి శ్రీధర్‌లు వివిధ విభాగాలను ప్రారంభించారు.

# మీ త్యాగం అమరం-

### - పోలీసు అమరవీరులకు సలాం

తమ కోసం బతికేవాడు కాదు..

పది మంది కోసం ప్రాణాలర్పిం చేవాడే నిజమైన అమరుడు..! విధి నిర్వహణలో ప్రాణాలు సైతం లెక్క చేయక, భద్రత కోసం అహర్నిశలూ శ్రమించేవాడే జవాను. తీవ్రవాదులు పెచ్చరిల్లినా.. ముష్కరులు విరుచుకుపడినా.. శత్రు దేశాలు దండెత్తినా.. మడమతిప్పక పోరాడే రక్షకభటునికి సలాం చేయాల్సిందే. అలా పలు పోరాటాల్లో అశువులు బాసిన జిల్లాకు చెందిన పలువురు అమరవీరులను ప్రతి ఏటా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్స వం రోజున స్మరించుకొని వారి త్యాగాలను గుర్తుచేసు కోవడం మన కర్తవ్యం. 1959 సంవత్సరం అక్టోబరు 21న భారత్-చైనాల మధ్య సీయాచిన్ సరిహద్దుల్లోని లడక్ ప్రాంతంలో జరిగిన యుద్ధంలో దేశానికి చెందిన పదిమంది జవాన్లు అమర వీరులయ్యారు. నాటి నుంచి ఏటా పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం జరుపుకోవడం ఆనవాయితీగా మారింది. కోవిడ్ నిబంధనల కారణంగా ఈ ఏడాది అక్టోబరు 21 నుంచి 31 వరకు వారి త్యాగాలకు గుర్తుగా సంస్మరణ కార్యక్ర మాలు నిర్వహించడానికి పోలీసు ఉన్నతాధికారులు నిర్ణయించారు.



### త్యాగాలు మరువలేనివి

ప్రజల రక్షణలో భాగంగా మావోయిస్టుల దాడుల్లో ప్రాణాలు కోల్పోయిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివి. ఏటా అమర వీరులకు అక్టోబరు 21న నివాళులు అర్పిస్తూ వారి త్యాగాలను భావితరాల యువతకు తెలియజేస్తూ జిల్లావ్యాప్తంగా వారోత్సవాలు నిర్వహిస్తున్నాం. అమరవీరుల త్యాగాలు భావితరాలకు స్ఫూర్తిదాయకం కావాలి. అమర వీరుల కుటుంబాలకు పోలీస్ శాఖ అండగా నిలుస్తుంది. ఈ ఏడాది 21 నుంచి 31 వరకు 10 రోజుల పాటు ప్రజల భాగస్వామ్యంతో పోలీసు అమర వీరుల సంస్మరణ కార్యక్రమాలు జిల్లా వ్యాప్తంగా నిర్వహిస్తున్నాం

- కేవీ మహేశ్వర్ రెడ్డి, ఎస్పీ, శ్రీకాకుళం

### నక్సల్స్ ఘాతుకానికి

జిల్లా చరిత్రలో 1992లో నక్సల్స్ (మావోయిస్టులు) ఘాతుకానికి ఎస్ఐ బంగారునాయుడు బలయ్యాడు. విజయ నగరం జిల్లా డెంకాడ మండలం గుణుపూరుపేటకు చెందిన నాయుడు బారువ, కాశీబుగ్గ పోలీసుస్టేషన్‌లో పనిచేశారు. మందస మండలం రట్టి, బేతాళపురం గ్రామాల మధ్య కొండల్లో నక్సలైట్లు ఉన్నారనే సమాచారం రావడంతో అక్క డకు వెళ్లారు. మార్చి 23వ తేదీన ఉద్దానం దళానికి చెందిన నక్సలైట్లు జరిపిన కాల్పుల్లో మృతి చెందాడు.





### ఎదురు కాల్పుల్లో

1948లో ఫిబ్రవరి 9న కోటబొమ్మాళి మండలం జర్జంగిలో జన్మించి, 1971 పోలీసు శాఖలో కానిస్టేబుల్‌గా సర్వీసు ప్రారంభించిన అన్నెపు పాపారావు నక్సల్స్ తూటాలకు బలయ్యాడు. పలాస మండలం నీలిభద్రలో ఒకరిని హత మార్చి, ఆస్తిని దోచుకునేందుకు నక్సలైట్లు ప్రణాళిక వేశారన్న సమాచారం తెలుసుకున్న పోలీ సులు సదరు వ్యక్తి ఇంటి వద్ద పికెట్ ఏర్పాటు చేశారు. దానికి ఇన్‌ఛార్జిగా హెడ్‌కానిస్టేబుల్ అన్నెపు పాపారావు వ్యవహరించారు. 1997 జూలై 17 అర్ధరాత్రి తుపాకులతో నక్సలైట్లు విరుచుకుపడగా పాపారావు ఎదురుకాల్పులు జరిపి, వీరోచితంగా పోరాడి నక్సల్స్ తూటాలకు నేలకొరిగాడు.

### సహించలేక కాల్చిచంపారు

నక్సలైట్ల కదలికలను ఎప్పటికప్పుడు తెలుసుకొని ఉన్నతాధికారులకు అందిస్తూ సమాచార సేకరణలో దిట్టగా పేరుగాంచిన నరేంద్రదాసు నక్సల్స్ ఉద్యమాన్ని నీరుగార్చేందుకు తనవంతుగా విశేషమైన కృషి చేశారు. నక్సలైట్ల దిన చర్యలను, కదలికలను గమనించి, నిరోధించడంలో ఎం.ఎస్. నరేంద్రదాసు సఫలమవుతుండటాన్ని నక్సల్స్ సహించలేకపో యారు. దీంతో 1997 మార్చి 17న కాశీబుగ్గలో దేవాలయా నికి దర్శనం కోసం వెళ్లిన దాసును కాపుకాసి పిస్టల్‌తో నక్సల్స్ కాల్చి చంపారు. 1971లో పోలీసుశాఖలో చేరిన దాసు స్పెషల్ బ్రాంచి ఇంటెలిజెన్స్ విభాగాల్లో సమర్థవంతమైన సేవలు అందించారు.





### దారికాసి మట్టుపెట్టారు

1970 మార్చి 15న సంతకవిటి మండలం వాల్తేరులో జన్మించిన పి.కృష్ణమూర్తిని నక్సల్స్ దారికాసి మట్టు పెట్టారు. 1993లో కానిస్టేబుల్‌గా చేరాడు. నక్సలైట్ల కార్య కలాపాల సమాచారం తెలుసుకొని వారి ఏరివేతలో చురు కైన పాత్ర పోషిస్తూ శాంతిభద్రతలను పరిరక్షిస్తున్న కృష్ణ మూర్తిని టార్గెట్‌గా ఎంచుకొని కాల్చిచంపారు. నక్సల్స్ ఉద్యమానికి అవరోధాలు సృష్టిస్తున్నాడని 2000 జూన్ 5న మందస మండలం, హరిపురం కూడలిలో విధుల్లో ఉన్న కృష్ణమూర్తిని నక్సలైట్లు మాటువేసి కాల్చి చంపారు.

### మందుపాతర పేలి


పొందూరు మండలం లోలుగులో నిరుపేద కుటుంబంలో 1976 ఏప్రిల్ 15న జన్మించిన ఎస్.వి.రమణ 1998 సెప్టెంబర్ ఒకటిన కానిస్టేబుల్‌గా విధుల్లో చేరి, స్పెషల్ పార్టీలో చురుకుగా విధులు నిర్వహించారు. నులకజోడులో సుమారు 200మంది నక్సలైట్లు స్థానిక రైసుమిల్లులో దోపిడీ చేసి బియ్యం బస్తాలు ఎత్తుకెళ్లిపోయారు. దానిపై కూంబిం గ్‌కు వెళ్లిన స్పెషల్ పార్టీలో సభ్యుడైన రమణ 2001 అక్టోబరు 27న నడిమిగూడ వద్ద నక్సల్స్ అమర్చిన మందు పాతర పేలి మృతిచెందారు.



# ‘నోబెల్’ గీతకారుడు..!







Nobel Prize for Physics winners Syukuro Manabe, Klaus Hasselmann, and Giorgio Parisi
ILLUSTRATION BY NIKLAS ELMEHED, NOBEL PRIZE OUTREACH




**/ నోబెల్ బహుమతి విజేతల ముఖపత్రకారుడు**
**/ ప్రపంచంలోనే అరుదైన అవకాశం దక్కించుకున్న వైనం**
**/ ముచ్చటపడుతున్న నెటిజన్లు**

ప్రతిఏటా నోబెల్ బహుమతుల ప్రకటన అక్టోబరు నెలలో జరుగుతుంటుంది. వివిధ విభాగాలలో విజేతల పేర్లను ప్రకటిస్తూనే నోబెల్ కమిటీ వారి అసలు ఛాయాచిత్రాలను (ఫోటోలు) కాకుండా బ్లాక్ అండ్ గోల్డ్ రేఖాచిత్రా (పోర్ట్రేయిట్)లను విడుదల చేస్తుండడం మీరు గమనించే ఉంటారు. ఆ బొమ్మలను వేసేది స్వీడన్‌కు చెందిన నిక్లస్ ఎల్మహద్. ఈయన ఒక విజువల్ ఆర్టిస్ట్. 2021లో ఆ ఆర్టిస్టు పేరును నోబెల్ కమిటీ ప్రకటించేవరకూ ఎవరికీ తెలియదనే చెప్పాలి. ఇప్పటికీ ఆయన వేసిన ఛాయాచిత్రాలు సంపాదించిన పేరు ప్రఖ్యాతులను ఇంకా ఆయన సంపాదించలేదనే చెప్పాలి. ఎందుకంటే ఇప్పటికీ ఆయన పేరు చాలామందికి తెలియదు కనుక. చాలా విచిత్రమైన విషయం ఏమిటంటే, నోబెల్ బహుమతి విజేతల వివరాలు ఈ ప్రపంచంలో ముందు తెలిసేది ఆయనకే. ఎందుకంటే వారి బొమ్మలు గీయాలి కనుక. నిజానికి నోబెల్ కమిటీ సభ్యుడుగాని, జ్యూరీతో ఎటువంటి సంబంధమూ లేని ఈ ఆర్టిస్టు గీసిన బంగారు తాపడపు చిత్రాలనే ప్రపంచంలోని అన్ని పత్రికలు, టీవీ చానెళ్లు వాడి విజేతల వివరాలను వెల్లడి చేస్తాయి. ఆ తర్వాత విజేతలను మీడియా సంస్థలు వ్యక్తిగత ఇంటర్వ్యూలు చేసి వారి ఫోటోలు ప్రచురిస్తాయి. 2012 నుంచి నోబెల్ విజేతల స్వర్ణమయ చిత్రాలను గీస్తున్నది ఈయనే కావడం మరో విశేషం.



Americans Harvey J Alter and Charles M Rice, and British scien
Michael Houghton were awarded the Nobel Price for Medicine.

**Nobel Medicine Prize 2020: Three scientists awarded jointly for Hepatitis C virus discovery**






## / సుదీర్ఘంగా సాగిన మీడియా సమావేశం /

సాధారణంగా శాస్త్రవేత్తలు వారి వారి ప్రపంచాలలో దాదాపుగా బందీలై ఉంటారు. సెలబ్రిటీల మాదిరిగా వారి వివరాలు, ప్రత్యేకంగా ఫోటోలు ఇంటర్‌నెట్లో దొరకవు. ఒక వేళ దొరికినా అవి చాలా తక్కువ రిజల్యూషన్‌లో ఉంటాయి. అవి ఆయా ప్రయోగశాలల వెబ్‌సైట్ స్టాఫ్ వివరాల పేజీలలో దొరుకుతాయి. లేదంటే వారి రెజ్యూమ్‌లలో దొరుకుతాయి. అందుచేత అవి పత్రికలలో ప్రచురించడానికి, టీవీలలో చూపించ డానికి ఇబ్బందిగా ఉండేది. వారికి ఫోటోలు అడిగినట్లయితే విజేతల వివరాలు ఊహించడానికి ఆస్కారముంటుంది. దీనివల్ల నోబెల్ కమిటీ న్యాయమూర్తుల మీద అనవసర వత్తిడి పెరుగుతుంది. ఆ ఇబ్బందులన్నింటినీ అధిగమించడానికి విజేతల ఛాయాచిత్రాలను వేయించి అందించడమే పరిష్కారమని నోబెల్ కమిటీ భావించింది. ఒకసారి “పాపులర్ సైన్స్” మాసపత్రికకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఈ విషయాలు చిత్రకారుడు ఎల్మెహద్ ఈ విషయాలు పంచుకున్నాడు.

2012లో నోబెల్ మీడియా డైరక్టర్‌గా అతనికి ఉద్యోగం లభించింది. అప్పట్లో నలుపు తెలుపు చిత్రాలే వేసేవాడు. అయితే 2017లో నోబెల్ కమిటీ ఈ చిత్రాలలో మార్పులు తీసుకురావాలని తలచింది. దానికి బంగారపు పూత పూయాలన్నది నోబెల్ కమిటీ ఆలోచన. దానిని సాధించడానికి ఒక ఆరు నెలలు కృషి చేసాడు. చివరకు తెలుపు యవనిక మీద నలుపు గీతలకు స్వర్ణతావిని పూతగా పూయాలన్న ఎల్మెహద్ ఆలోచనకు నోబెల్ కమిటీ ఓకె చెప్పింది. మొదట్లో ఈ బంగారు తాపడపు చిత్రాలను పూర్తి చేయడానికి రోజుల తరబడి సమయం పట్టేది కాని, ఇప్పుడు మాత్రం కొన్ని గంటల వ్యవధిలో చిత్రాలను అందివ్వ గలుగుతున్నానని ఆయన చెప్పాడు. ఆయన వేసిన పలువురు విజేతల ముఖచిత్రాలతో పాటు నోబెల్ బహుమతులకు సంబంధించిన అనేక ఇతర చిత్రాలను కూడా ఆయన వెబ్‌సైట్‌లో చూడవచ్చు.

(https://niklaselmehed.com/)

-దుప్పల రవికుమార్

# మాతృభూమి శ్రేయస్సు కోసం పనిచేసేది పోలీసులే

**- రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**
**- ఘనంగా అమరవీరుల సంస్మరణ దినోత్సవం**




(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

ప్రజలకోసం పోరాడుతూ అమరవీరులైన వారిని స్మరించుకోవడం మన అందరి బాధ్యత, మాతృభూమి శ్రేయస్సు పనిచేసిన నిస్వార్థ శ్రామికులు పోలీసులు అని రాష్ట్ర వ్యవసాయ శాఖామంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు పేర్కొన్నారు. సోమవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఎస్పీ కె.వి.మహేశ్వర్‌రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన పోలీసు అమర వీరుల సంస్మరణ దినోత్సవ కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా అమరవీరుల స్థూపం వద్ద కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, జేసీ ఫర్మాన్ అహమ్మద్‌ఖాన్, జిల్లా జడ్జి జునైద్ అహ్మద్ మౌలానా, ఎస్పీ కె.వి.మహేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే గొండు శంకర్, ఎన్.ఈశ్వర రావులతో కలిసి శ్రద్ధాంజలి ఘటించారు. అనంతరం మాట్లాడుతూ దేశంకోసం లడాక్‌లో తమ ప్రాణాలర్పించిన ఆశువులు బాసిన అమర వీరులకు నివాళులు అర్పిస్తూ పోలీసుల అమరవీరుల దినోత్సవంగా ప్రతి సంవత్సరం అక్టోబరు 21న జరుపుకుంటున్నామన్నారు. దేశం అభివృద్ధి చెందాలంటే పోలీస్ పాత్ర చాలా కీలకమన్నారు. మన రాష్ట్రంలో పోలీసు వ్యవస్థ పనితీరుపై గర్వపడుతున్నానన్నారు. రాష్ట్రంలో గంజాయి, మాదకద్రవ్యాలు అరికట్టేందుకు పోలీసులు ప్రత్యేక దృష్టి సారించాలన్నారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం మాదకద్రవ్యాల రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దాలన్నారు. అందుకు కఠినమైన నిర్ణయాలు తీసుకోవాలన్నారు. రహదారి ప్రమాదాలను టెక్నాలజీని ఉపయోగించి ఆరికట్టాలన్నారు. విజయవాడలో వచ్చిన వరదలలో పోలీసులు అందించిన సేవలు కొనియాడారు. ప్రతి పౌరుడు పోలీసు యంత్రాగానికి సహకరించాలన్నారు. కలెక్టర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్ మాట్లాడుతూ ప్రజల కోసం నిరంతరం పోరాటం చేస్తున్న పోలీసు సేవలు అభినందనీయమన్నారు. దేశచరిత్రలో పోలీసు సంస్మరణ దినం విశిష్ట దినంగా భావిస్తున్నామన్నారు. ఆపద సమయంలో వెనకడుగు వేయకుండా ప్రజల పక్షాన పోరాటం చేస్తున్నవారు ఒక్క సైనికులు పోలీసులే అన్నారు. ఎస్పీ కె.వి. మహేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ తాము విధి నిర్వహణే పరమావధిగా భావిస్తామన్నారు. దేశవ్యాప్తంగా 216మంది అమరులయ్యారని అందులో మన రాష్ట్రానికి చెందిన వారు ఇద్దరు ఉన్నారన్నారు. విధి నిర్వహణలో పోలీస్ కుటుంబాలకు దూరంగా ఉంటారన్నారు. ప్రభుత్వం పోలీసులకు అనేక సౌకర్యాలు కల్పిస్తున్నారన్నారు. కారుణ్య నియామకాలు ఈ సంవత్సరం 5గురికి ఉద్యోగం ఇవ్వడం జరిగిందన్నారు. విడో, ఫ్లాగ్ నిధులనుండి సహాయ అందజేయడం జరుగుతుందన్నారు. పోలీసు ప్రజల సమస్యలు తీర్చడానికే ఉన్నారని అందరూ గమనించాలన్నారు. హోంగార్డ్స్ సంక్షేమానికి అనేక కార్యక్రమాలు చేపట్టామన్నారు. ప్రజల్లో అభిమానం గౌరవం పొందేలా ప్రతీ పోలీసు విధులు నిర్వహించాలన్నారు. జిల్లా పోలీసుశాఖ బాధిత కుటుంబాలకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని,వారి కోసం అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడతున్నామని ఎస్పీ తెలిపారు. అనంతరం కార్యక్రమంలో చివరిగా ఓపెన్ హౌస్ ప్రారంభించి తిలకించారు. కార్యక్రమంలో జిల్లా పోలీసు శాఖ రూపొందించిన అమర వీరుల గ్రంథంలో దేశ రక్షణలో ప్రాణ త్యాగం చేసిన 216అమరవీరుల పేర్లను పుస్తకాన్ని వ్యవసాయశాఖా మాత్యులు ఎస్.పి కి అందజేశారు. డి ఎస్ పి వివేకానంద్ పుస్తకంలో పేర్లు చదివి వినిపించారు. ఈ కార్యక్రమానికి అదనపు ఎస్పీ పి శ్రీనివాసరావు, డీఎస్పీ లు వివేకానంద, రాజశేఖర్, శేషాద్రి, ప్రసాద్, అమర వీరుల కుటుంబ సభ్యులు,సీఐలు ఇతర పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

# ఎన్‌సీఆర్‌టీ సిలబస్ తయారీకి సిక్కోలు ఉపాధ్యాయుడు

(సత్యంన్యూస్, రణస్థలం)



కేంద్రం ప్రవేశపెట్టిన నూతన జాతీయ విద్యావిధానం అమలులో భాగంగా ఈ నెల 22 నుంచి 24 వరకు ఆర్ఐఈ మైసూరులో జరగనున్న ఎన్‌సీఈఆర్‌టీ నూతన పాఠ్యపుస్తకాల తయారీకి కొచ్చెర్ల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో పనిచేస్తున్న సిక్కోలు ఉపాధ్యాయుడు బి.రాజేశ్వరరావు ఎంపికయ్యారు. ఆయన ఇదివరలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం పాఠ్యపుస్తక తయారీలో, యునెస్కో నిర్వహించిన అంతర్జాతీయ సదస్సులో ప్రాథమిక విద్యబోధనా విధానాలపై కూడా పాల్గొన్నారు. ఆయన ఎంపిక పట్ల డీఈవో ఎస్.తిరుమల చైతన్య, ఉపవిద్యాశాఖాధికారి ఆర్.విజయకుమారి, రణస్థలం మండల విద్యాశాఖాధికారులు ఏ.త్రినాథరావు, బి.లావణ్య, ఉపాధ్యాయులు, ఉపాధ్యాయ సంఘ నాయకులు అభినందనలు తెలిపారు.

# వైభవంగా అసిరితల్లి విగ్రహ ప్రతిష్ఠ

(సత్యంన్యూస్, ఎచ్చెర్ల)



తమ్మినాయుడుపేట గ్రామంలో వెలసియున్న అసిరితల్లి అమ్మవారి (గ్రామదేవత) విగ్రహ ప్రతిష్ఠ మహో త్సవం కార్యక్రమం సోమవారం వైభవంగా జరిగింది. ఉదయం 8.23 గంటలకు సచ్చిదానంద సరస్వతి మహాస్వామి పర్యవేక్షణలో తెన్నేటి విక్రమ్ ప్రకాశ శర్మ, ఆలయ ప్రధాన అర్చకులు శ్రీపాద సురేష్‌శర్మ విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవం నిర్వహించారు. ఆలయ ధర్మకర్త శ్రీనివాసరాజు ఉమాదేవి దంపతులు చేతుల మీదుగా ఈ విగ్రహ ప్రతిష్ట కార్యక్రమం జరిగింది. అసిరితల్లి అమ్మవారి విగ్రహ ప్రతిష్ఠ కార్యక్రమానికి మాజీ మంత్రి ధర్మాన ప్రసాదరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన స్వాగతం పలికి, పూజలు నిర్వహించారు. అనంతరం మధ్యాహ్నం భక్తులకు అన్నప్రసాదాన్ని అందించారు.

# డిసెంబర్ 11న భగవద్గీత కంఠస్థ పోటీలు

(సత్యంన్యూస్, శ్రీకాకుళం)

డిసెంబర్ 11న గీతా జయంతిని పురస్కరించుకొని తిరుమల తిరుపతి దేవస్థానములు, హిందూ ధర్మ ప్రచార పరిషత్ శ్రీకాకుళం జిల్లా శాఖ ఆధ్వర్యంలో భగవద్గీత ఆరవ అధ్యాయం ఆత్మ సంయమ యోగంపై పోటీలు నిర్వహించనున్నట్టు హిందూ ధర్మ ప్రచార పరిషత్ ప్రోగ్రాం అసిస్టెంట్ ఎం.లలితమణి తెలిపారు. ఈమేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. 6, 7 తరగతులు మొదటి గ్రూపు గాను, 8,9,10 తరగతులు రెండవ గ్రూపుగాను, 18 అధ్యాయాలు పూర్తిగా వచ్చినవారికి మూడవ గ్రూపు గాను పోటీలు నిర్వహిస్తామన్నారు.

# కన్ను పోయిందా.. సెటిల్మెంట్ చేస్కో!

**- గ్రీవెన్స్‌లో ఫిర్యాదు చేసినా పట్టించుకోని అధికారులు**

(సత్యంన్యూస్,శ్రీకాకుళం)

రణస్థలం మండలం పైడిభీమవరం జెడ్పీ హైస్కూల్‌లో ఎనిమిదో తరగతి చదువుతున్న కుమార్‌కు క్లాస్ టీచర్ అరుణ్‌కుమార్ కొట్టడం వల్ల ఒక కన్ను కోల్పోయాడు. అయ్యా మీరు కొట్టిన దెబ్బలకు నా కుమారుడు కుడికన్ను తొలగించాల్సి వచ్చిందని తల్లిదండ్రులు బోరుమంటే పాఠశాలలో పట్టించుకొనే నాధుడే లేడు. ఈనెల 7న జెఆర్‌పురం పోలీస్‌స్టేషన్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేసినా ఇప్పటివరకు కేసు నమోదు చేయలేదు. డీఈవో తిరుమల చైతన్యను ఆశ్రయిస్తే సెటిల్ చేసుకుందాం రండి అంటూ నిర్లక్ష్యంగా మాట్లాడుతున్నారు. ఉన్నతాధికారులను గ్రీవెన్స్‌లో కలిసి ఫిర్యాదు చేస్తే విద్యాశాఖ అధికారుల నుంచి నివేదిక కోరి చర్యలు తీసుకుంటామని చెప్పి మూడు వారాలు గడిచింది. ఈ ఘటనపై డీఈవో తిరుమల చైతన్య, డిప్యూటీ డీఈవో విజయకుమారి ఉన్నతాధికారులను తప్పుదోవ పట్టించే విధంగా నివేదిక ఇచ్చారని బాధితుడి తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు. ఉపాధ్యాయుడు కొట్టడం వల్ల కంటికి గాయం కాలేదని, విద్యార్థులను క్యూలైన్‌లో ఉండాలని వారించే క్రమంలో కంటికి గాయమైనట్టు నివేదిక ఇచ్చారని తెలిసింది. దీనిపై సోమవారం జేసీ ఫర్మాన్ అహ్మద్‌ను గ్రీవెన్స్‌లో కలిసి తమ కుమారుడికి న్యాయం చేయాలని విన్నవించారు. విద్యాశాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని జెడ్పీ వద్ద నిరసన తెలిపారు.

వివరాల్లోకి వెళితే.. ఈనెల ఒకటిన సాయంత్రం తరగతి గదిలో పాఠ్య పుస్తకాలు పంపిణీ చేస్తున్న సందర్భంగా క్యూలో విద్యార్థులు ఒకిరిని ఒకరు నెట్టుకున్నారు. దీన్ని గమనించిన ఉపాధ్యాయుడు అరుణ్‌కుమార్ విద్యార్థులందరినీ కర్రతో దండించాడు. ఆ సమయంలో విద్యార్థి కుమార్ కంటిలో కర్ర గుచ్చుకొని రక్తం కారసాగింది. విద్యార్థి ఏడుస్తునే నేలకొరిగిపోయాడు. అక్కడి నుంచి ఉపాధ్యాయుడు అరుణ్‌కుమార్ మెల్లగా జారుకొని హెచ్‌ఎం ఛాంబర్‌కు వెళ్లిపోయాడు. కంటినుంచి రక్తం కారుతుండడంతో పీడీ రాము విద్యార్థిని సమీపంలో ఉన్న మూర్తిరాజు ఆస్పత్రికి తీసుకువెళ్లారు. విషయం తెలిసిన విద్యార్థి తండ్రి నాగరాజు అక్కడకు చేరుకున్నాడు. కర్రతో కొట్టిన అరుణ్‌కుమార్, హెచ్‌ఎం శోభారాణి కంటికి ఏమీ కాలేదంటూ వెయ్యి రూపాయలు చేతిలోపెట్టి కారులో వెళ్లిపోయారు. తర్వాత రోజు బాధిత విద్యార్థిని విజయనగరంలోని కంటి ఆస్పత్రికి తీసుకుని వెళ్లారు. అక్కడ వైద్యులు పరీక్షలు నిర్వహించి తక్షణం ఎల్‌వీ ప్రసాద్ కంటి ఆసుపత్రికి తీసుకొని వెళ్లాలని రిఫర్ చేశారు. విశాఖలోని ఎల్‌వీ కంటి ఆసుపత్రిని సంప్రదించిన తర్వాత పరీక్షలు నిర్వహించి శస్త్రచికిత్స చేసి కంటిలో ఉన్న కర్రపుల్లను బయటకు తీశారు. అయితే కంటిలో కర్రపుల్ల ఉండడంతో కన్ను చీము పట్టి 90 శాతం కంటి చూపు కోల్పోయినట్టు ఎల్‌వీ ప్రసాద్ వైద్యులు నిర్ధారించినట్టు విద్యార్థి తల్లిదండ్రులు చెబుతున్నారు. తమకు నష్టానికి ఎవరు బాధ్యత వహిస్తారని బాధితులు విద్యాశాఖ అధికారులను ప్రశ్నిస్తే రాజీకి పిలుస్తున్నారు. ఇప్పటి వరకు అసలు తాము కొట్టలేదని, కొట్టడం వల్ల కంటికి దెబ్బ తగలలేదని చెప్పిన విద్యాశాఖ అధికారులు సెటిల్మెంట్‌కు రావాలని ఎలా పిలుస్తున్నారని విద్యార్థి తల్లిదండ్రులు ప్రశ్నిస్తున్నారు. విద్యాశాఖ అధికారులు తమకు సంబంధం లేనట్టు వ్యవహరిస్తున్నారని, పోలీసులకు ఫిర్యాదు చేసినా ఇప్పటి వరకు కేసు నమోదు చేయలేదని, అన్ని వ్యవస్థలను విద్యాశాఖ అధికారులే మేనేజ్ చేస్తున్నారని బాధితులు ఆరోపిస్తున్నారు. విద్యార్థికి జరిగిన అన్యాయంపై బాలల హక్కుల కమిషన్‌కు ఫిర్యాదు చేసినా ఎటువంటి చర్యలు తీసుకోలేదని, దీనిపై ఉన్నతాధికారులు, ప్రభుత్వ పెద్దలు జోక్యం చేసుకొని న్యాయం చేయాలని బాధిత కుటుంబసభ్యులు కోరుతున్నారు.



Printed by N.V.S. prasad, at Srikakulam and published by SATYAM PRINTERS, plot No. 8, Santamma colony, Srikakulam- 532001, Andhrapradesh on behalf of SANCHALANA SAYANKALA PATRIKA SATYAM, Srikakulam. Editor N.V.S. Prasad, Srikakulam, Andhra Pradesh. APTEL No. 2005/17967. Postal Reg. No. D/RNP/SKL-12/12-15.